"అమ్మా !

సుధాకర్ గురించి చెప్పాను కదా! నాయుళ్ళు లేనేం మనుషులు కాదా? అసలు నేను పెళ్ళంటూ చేసుకుంటే అతన్నే చేసుకుంటాను. నాన్నగారితో చెప్పావనుకుంటాను. నాక్కావలసినవి మీ నిండైన ఆశీస్సులు.

నే కోరుకున్న దెప్పుడూ కాదన్లేదు మీరు. అసలలాంటి పరిస్థితే రాదన్నదే నా ఆత్మ విశ్వాసం.

జీవితాంతం కావలసినది కోరుకుంటున్నాను కాబట్టి మీరు సంతోషంగానే అంగీకరించాలి.

—సుజాత."

తీరిక వచ్చినప్పుడు సూచనగా చెప్పింది. ఆ తరవాత ఇదిగో ఈ ఉత్తరం.

ముచ్చట పడుతూంది కాబట్టి చేసెయ్యడం మంచిది. కులాలూ, మతాలూ అన్న పట్టింపు మన కొద్దు. రేపు మనం కాదూ, కూడదూ అంటే నా ఇష్టం అన్నా అనేయచ్చు. లేకపోతే అర్జెంటుగా పెళ్ళి చేసేసుకునైనా రావచ్చు! కాబట్టి, ఇంకా కాలయాపన అనవసరం. మీరు కాకినాడ వెళ్ళి మాట్లాడేసి మంచి పెద్దలు చూసి రావడం మంచిది!"

"చిన్నపిల్ల. తెలిసో తెలియకో అది తొందరపడితే నచ్చ చెప్పాలి గాని మనమూ తొందర పడతామా?"

అది కాదండీ!"

ఇంకేం చెప్పకు జానకీ. నా కిది సుతరామూ

# 'మానస'

# ఈ పెళ్ళి వద్దమ్మా!

ఇష్టం లేదు. కులాలూ మతాలూ ఈ పట్టింపులు పెద్దవాళ్ళెందుకు పెట్టారో. అవలా సాగిపోవడమే మంచిది."

మంచిది అని మనం అనుకుంటే సరిపోదు కదా అన్నీ కలిసి రావాలి."

ఏమిటి నీ ఉద్దేశం?"

మీరే ఆలోచించండి. దాన్నెలా పెంచారో! కొండమీది కోతి కావాలంటే తెచ్చిచ్చారే."

"దానికీ దీనికీ ఏమిటి సంబంధం?"

"ఎంతైనా ఉంది. దాన్ని నొప్పించడం మీకు చేతకాని పని. అది నోరు విప్పి అడిగితే చాలు—సమకూరుస్తారు మీరు. అలాంటప్పుడు మీరు కాదనరని ధీమా దానిది."

"నిజానికి దానికన్నా చిన్నపిల్లలా మాట్లాడుతున్నావు నువ్వు! అమ్మా, వద్దు తల్లీ అంటే వూరుకుంటుంది. ఇంకా మొండిగా ఉంటే 'నా మాట వినమ్మా' అని జాలిగా అర్థిస్తే చాలు నవ్వుతూ ఒప్పేసుకుంటుంది బంగారు తల్లి. నా కా నమ్మకం ఉంది. కాబట్టి మనం తొందరపడి ఒక నిర్ణయానికి రానక్కర్లేదు."

"మీ విశ్వాసం అలా ఉండి అలాగే జరిగితే అంతకన్నా కావలసింది లేదు మనకి. ఆడపిల్లల్ని కన్నవాళ్ళం కాబట్టి తొందరా బాధ్యతా తప్పవు మనకు."

"తెలిసో తెలియకో ఆదలా క్షణంలో తీసుకున్న నిర్ణయాన్ని మనం అమలు జరపడానికి రెడీగా లేం కాబట్టి తొందర లేదు. ఎవరో ఒక నాయుడ్ని చేసుకుంటానంటే చేతులు ముడుచుకుని మనం కూర్చోడం లేదు కాబట్టి బాధ్యతని విస్మరిస్తున్నట్లు కాదు."

"అది కాదండీ!"

"ఇంకేం చెప్పకు జానకీ! రేపే నా కాకినాడ ప్రయాణం. వెళ్ళి దానికి నచ్చ చెప్పి. నాతోపాటే తీసుకొచ్చేస్తాను—నాలుగు రోజులుండి వెళుదువు కాని అని, సరేనా?"

"సరే. అలాగే కానివ్వండి."


•　　•　　•

"కనీసం ఉత్తరం అన్నా రాయకుండా వెళుతున్నారు. బస్సు దిగగానే ముందు దానికి ఫోను చెయ్యండి. సంతోషిస్తుంది పిచ్చితల్లి" అని జానకి చెప్పింది మనసులో మెదులుతున్నా—నేను సుజాతకి ఫోన్నెయ్య లేదు. సరాసరి సినిమా హాలు వీధిలో ఉన్న ఆ లాడ్జికి వెళ్ళి స్నానం చేసి ఒక పావుగంట రెస్టు తీసుకుని బయలుదేరాను సుజాత హాస్టలుకి.

సుజాత అక్కడ లేదు! ఫ్రెండ్స్‌తో సినిమా కెళ్ళిందిట.

అప్పుడనిపించింది జానకి చెప్పినట్టు చేసే,






ఎంత బాగుండేదని. దాదాపు మూడు గంటలు గడపాలి నెమ్మదిగా బయలుదేరాను మళ్ళీ పూళ్ళోకి. నా గమ్యం స్పష్టం చియేటలు. ఆ పోలుకి వెళ్ళిందిట సుజాత. తాపీగా నడుస్తూ వెళ్ళినా ఇంటర్వెల్ లోనే కలుసుకోవచ్చు లన్నీ.

మారిన వూరుని విస్మయంగా చూస్తూ నడుస్తున్నాను. నే నెరిగిన కాకినాడలా లేదు. అంతా ఏదో కొత్తగా ఉంది. పెంకుటిళ్ళ స్థానే మేడలు వెలిశాయి. రోడ్డంతా ఫ్లోరసెంట్ దీపాలతో పట్టపగల్లా మెరిసి పోతూంది. బస్సులూ కార్లూ, రిక్షాలూ చాలా సందడిగా తిరిగేస్తున్నాయి.

ఇహ జనం సంగతి వేరే చెప్పక్కరలేదు.

సెంటర్ సెంటర్లో బాతాఖానీ వేసేవాళ్ళొ పక్కా, హడావిడిగా తిరిగే వాళ్ళొ పక్కా.

అసలు నే నొచ్చింది కాకినాడేనా అనిపించింది. నా సందేహానికి నేనే ఆశ్చర్యపడీ, ఆనందపడీ నడుస్తున్నాను. రోడ్లనీ, పరిసరాల్నీ చూసుకుంటూ. టూ టౌన్ పోలీస్ స్టేషన్ వచ్చేసరికి. అచేతనంగా ఆగిపోయి నాలుగు వైపులా చూస్తూ నిలుచున్నాను!

కాకినాడ ఎంత మారినా ఆ ప్రదేశం కొత్తగా అనిపించట్లేదు నాకు! టైము చూసుకున్నాను. ఏడూ ఇరవై. దాదాపు ఇంకా రెండు గంటలు గడపాలి. మూలనున్న కిళ్ళీకొట్లో సోడా తాగి ఒక అయిదు నిముషాలు ఆలోచిస్తూ నిల్చున్నాను.

మనసులో అంతర్లీనంగా ఆ చిన్న కోరిక!

అవును. ఆ చిన్న కోరికే!!

మళ్ళీ నా మానసిక పరిస్థితికి నాకే నవ్వు వచ్చింది. నే నింకా పాతికేళ్ళనాటి ఇంటర్మీడియేట్ స్టూడెంటునా? నాలో నేనే లక్ష్యించుకుని వాచీ చూసుకున్నాను. ఏడున్నర. టైము గడవట్లేదు.

ఎలా చూసుకున్నా ఇంకా రెండు గంటలు గడపాలి.

మనసు అధీనం తప్పుతోంది.

మళ్ళీ ఇందాకటి ఆలోచనలూ...ఆ చిన్న కోరికా!

అంతే.

ఇంటర్వెల్‌లోనే సుజాతని కలుసుకుని తన ఆనందాన్ని అంత అర్జెంటుగా పాడు చెయ్యడం దారుణం అని నాకు నేనే సమర్థించుకున్నాను. దాంతో మనసు కాస్త కుదుటపడింది.

నెమ్మదిగా కదిలి రామారావుపేట వైపు, తిరిగాను. అలా తిరగడం వరకే నా మానసిక సంఘర్షణా...ప్రమేయమూనూ! తిరిగి తిరగ్గానే అలవాటైన నడకలా సాగిపోయాను. రెండు మూడు వీధులు దాటి, ఆ సన్న సందు మొదట్లో నిల్చుని చుట్టూ పరికించి చూశాను. నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా ఉంది ప్రదేశం. ఉద్రేకంగా ఆ ఇంటి వైపు చూస్తూ నడిచాను.

ఉన్నట్టుండి నడక స్పీడు పెరిగింది. చిన్న ఒణుకు కూడా ప్రారంభమైంది. ఎవరైనా నన్ను గమనిస్తున్నారా అని వెనక్కి తిరిగి చూశాను... విశలంగా!

ఎవరూ లేరు.

గలమే!

• • • •

కాకినాడలో ఫలానా హైస్కూల్లో...ఆ సెక్షన్లో స్కూలు ఫైనలు పాసైన ఆ బ్యాచి మందే ఇంటర్లో ఆ క్లాసులో ఉండడంవల్ల... వైజాగ్ నుంచి వచ్చిన బ్యాచి ఒకటో బాచ్ని నే నొక్కడ్నే అపరిచితుడ్నీ, కొత్తవాడ్నీ వాళ్ళందరికీ కాలేజీ వాతావరణానికి అలవాటు పడడమే కష్టమైన ఆ పరిస్థితుల్లో నాకు మరో సమస్య—

కాలేజీలో చెట్టుమీదా...పుట్టమీదా, గోడ మీదా...బోర్డులమీదా, బెంచీమీదా, క్లాసు రూము కప్పులమీదా రామకోటిలా రాస్తున్న 'రాణి' అన్న పేరు మతి పోగొట్టింది నాకు.

ఎవ రీ రాణి?

ఏ క్లాసు?

ఏమిటీ విపరీతమైన పాపులారిటీ? అసలిప్పుడు చదువుతోందా, లేక ఎప్పటిదో పాత విషయమా? అని అనేక మీమాంసలు జేరిపోయాయి మస్తిష్కంలో. ఎవరినైనా అడిగితే లొంగిపోతానేమోనా అంటే...నోరు విప్పాలంటేనే భయం! మన కెందుకులే ఎవరైతే అవి వదిలేద్దామా అనుకుంటే 'కాదూ...కూడదూ' అని మనసు పీకడం—ఇదో పెద్ద సమస్యైపోయింది.

రాణి ఎవరో తెలీలేదు నాకు!

తెలియనికొద్దీ అన్వేషణ ఎక్కువైపోయింది!!

హైస్కూలునుంచి కాలేజీకి రాగలిగినందుకు శ్రద్ధగా చదువుకుని పైకి రావాలి గానీ ...అర్థం లేని ఈ ఆలోచన్లేమిటని లక్ష్యించుకుని నన్ను నేను సమాధానపరచుకున్నా. మనసు ఉండబట్టేది కాదు.

ఎక్కడ చూసినా కనపడే రాణి నోటితోపాటు

ఎవరినోట వినవచ్చినా వినపడే 'రాణి' అన్నమాటతో నాలో కుతూహలం మరింత పెరిగిపోయింది.


ఇంటరునుంచి డిగ్రీ క్లాసుల దాకా స్టూడెంట్లతో పాటు, కుర్ర డిమానుస్ట్రేటర్లు, లెక్చరర్ల నోట కూడా తరచు ఆ మాటే వెదిలేసరికి నాలో ఆ కుతూహలం తారాస్థాయికి చేరింది.

ఎవరీ రాణి? ఎందుకా పాపులారిటీ? అని.

దాదాపు రెండు నెలలు మదనపడ్డాను!

'అదిగో ఆ ఎర్ర చీరె కట్టుకున్న అమ్మాయి—రాణి అనీ ఫైనలియర్లే, నిన్నే లెక్చరర్‌ని దాదాపు కొట్టబోయింది!' అంటూ దూరంనుంచి చూపించాడు నా ప్రక్కన కూర్చునే రెడ్డి.

'రాణి' అన్నమాట వినగానే దాదాపు గగుర్పాటు కలిగింది నాకు. ఉద్రేకంగా చూశాను. మరింత రెచ్చిపోయిన ఆనందంతో. కానీ నాలోని అప్రయత్నమైన ఆ మార్పుని ఎంతమాత్రమూ వ్యక్తం




కానీయకుండా 'ఐ సీ' అన్నాను. ఏదో నాకు సంబంధించని విషయం విన్న ధోరణిలో! అలా రెడ్డి రాణిని చూపించి వస్తా గురూ...ఫీజు కట్టడానికి వెళ్తున్నా' అంటూ వెళ్ళిపోయాడు.

దూరంనుంచే నిశితంగా చూశాను రాణిని—

ఎరుపూ తెలుపూ మిళితమైన అందాల పసిడి ఛాయ నేనింతదాకా చూడలేదు. ఆ కర్ణానిమించి రసానుభూతి కలిగించే అటువంటి కనుదోయి జీవితంలో అదే మొదటిసారి చూడడం. సన్నని నాసికా అందమైన వంకీల జుట్టూ. ఆకళ్ళకు సరి సమానంగా పొదగబడినవనిపించింది. హుందాగా చేతుల కట్టుకుని కాలి బొటనవేలితో ఇసకలో రాస్తూ పది పదిహేను మంది మధ్యలో నిల్చున్న రాణిని చూస్తుంటే నిజంగా ఒక మహారాణిని చూస్తున్నట్టే ఫీలయ్యాను.

సరిగ్గా ఆ క్షణంలో అనిపించింది నాకు రాణిని పరిచయం చేసుకోవాలని! బహుశా ఆ మేరకు నేను వెళ్ళి ఆమెతో మాట్లాడితే మనస్ఫూర్తిగా పూరట చెందేదేమో? ఆత్మఘోషకి లోనయ్యేవాణ్ని కాదేమో?

క్లాసుకి వెళ్ళకుండా చెట్టుకిందే ఉండిపోయాను!

రాణితో పరిచయం కావాలి. ఎలా ఎలా? అదే ఆలోచన్లు!

రెండు గంటలు గడిచిపోయాయి. లాస్ట్ అవర్ క్లాసు లేక రాణి ఇంటికి తిరిగి వెళ్ళిపోతూంది ఫ్రెండ్స్‌తో కలిసి. భిన్నుడైపోయాను. ఆత్మీయమైనదేదో దూరమైపోతున్నట్టు మనసు కొట్టుకుపోయింది.

ఆ రోజంతా అదే ఆలోచనలతో నిద్ర పట్టలేదు. ఆ మరాడు మధ్యాహ్నం తను ఒంటరిగా తారసపడింది. వెళ్ళి పలకరిద్దామనుకునాను. కానీ ఏమని? ఎందుకు నాతో పరిచయం అంటే ఏమిటి నా సమాధానం?

అంతే.

కోరికనూ అణిచేసుకుని ఆలోచనల్లో పడిపోయాను:

రాణి ముఖంలో విరిసే విపరీతమైన తేజస్సు నాలో చెరగని ముద్ర వేసింది. అందుకే కాలేజీ అంతా రామకోటిలా తన పేరు రాయడంలో క్లాసుకి ఎంతో ఔచిత్యం ఉందనిపించింది. నేనా పూట క్లాసుకి వెళ్ళలేదు. సాయంత్రం క్లాసులైపోయి రాణి ఇంటికి వెళ్తుంటే భయం పీకుతున్నా, వెర్రి ధైర్యంతో దూరంగా ఫాలో అయి వెనకాలే వెళ్ళాను.

నడిచి నడిచి ఒక మైలు నడిచి, ఆ సందులోని ఆ పెంకుటింట్లోకి వెళ్ళిపోయింది. ఇంటి నంబరు చూసీ చూడగానే కంఠస్థం చేశాను. ఏదో పని ఉన్నవాడిలా వీధి చివరి దాకా వెళ్ళి అక్కడ్నుంచి గబగబా పోస్టాఫీసుకు వెళ్ళి—

"మిమ్మల్ని చూస్తుంటే నాకెందుకో విపరీతమైన గౌరవమూ అభిమానమూ కలుగుతున్నాయి. మీకు బ్రదర్సున్నారో లేదో నాకు తెలీదు గానీ నాకు మాత్రం అక్కయ్యలు లేరు. బహుశా ఈ లోటు తీరకే నాకీ అనుభూతి కలుగుతుందేమో? మీ పరిచయాన్ని కోరుకునే మీ బ్రదర్‌ని"

—అంటూ పేరు లేకుండా నన్ను నేను పరిచయం చేసుకుంటూ., నేను కాలేజీలో ఫలానా రోజున, ఫలానా చోట ఫలానా డ్రస్సేసుకుని నిల్చుంటాను — కనికరించదల్చుకుంటే వచ్చి పలకరించండి అని కూడా రాసి.

ఉత్తరం లోకల్ పోస్టులో వేసేశాను.

మూడు రోజుల తరువాత.

నేను చెప్పిన ప్రదేశంలో ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్టు చూస్తూ నిల్చుంది రాణి. గుండె దడదడలాడ సాగింది. అయినా, నా ఉనికి బయట పడకుండా క్లాసురూము నుంచే గమనిస్తున్నాను. దాదాపు అరగంటలా నిల్చుంది రాణి. నేనెంతకీ కనపడకపోయేసరికి కాబోలు... పుస్తకాల్లోంచి ఉత్తరం తీసి చదివి తను మళ్ళీ చూట్టూ పరిసరాల్ని చూస్తూంటే నాలో ఆనందానికి హద్దులు లేకపోయాయి!

అదే శుభసూచకంగా భావించి.

గంతేసి వెళ్ళబోయిన నేను అప్రయత్నంగా ఆగిపోయాను — నాలుగురోజుల క్రితం రెడ్డి చెప్పిన చెంపదెబ్బ ఉదంతం స్మృతిలో మెదిలేసరికి.

ఆ మాటే రాశాను మళ్ళీ ఉత్తరంలో!

ఈసారి ఫలానా టైములో ఫలానా చోట ధైర్యంగా నిల్చుంటానని రాశాను చివర్లో—

ఆ రోజు వచ్చింది!

వరండాలోంచి చూస్తున్నాను. నే చెప్పిన చోట ఆత్రతగా వెతుకుతూంది రాణి. ఆనందోత్సాహంతో ఈల వేసుకుంటూ బయల్దేరబోయాను. ఇంతలో రాణి ఫ్రెండ్స్ కౌసల్యా సీతా వచ్చేశారక్కడికి. అంతే, నాలో ధైర్యం, ఉత్సాహం రెండూ పోటీలు పడి దాక్కున్నాయి.

నోట్‌బుక్‌లో రెడీగా ఉన్న ఇన్‌లాండ్ కవర్ తీసి వెంటనే రాసేశాను. ఆ పరిస్థితిపై నా ఆందోళనని! లెక్చరర్ చెప్పే పాఠం బుర్ర కెక్కడం లేదు. క్లాసైపోగానే అర్జెంటుగా వెళ్ళి ఆ ఉత్తరాన్ని లైబ్రరీ పక్కగా ఉన్న పోస్టు డబ్బాలో పడేశా. అప్పటికి గానీ నా మనస్సు స్థిమిత పడలేదు.

"మిమ్మల్ని కలుసుకోవాలన్న ఆరాటం నాలో రోజు రోజుకీ పెరిగిపోతూంది. కానీ అందుకు ధైర్యం చాలక నే చస్తుంటే మీరు నేనెవరో పట్టుకోవాలని విఫలం వేస్తున్నట్టుంది. ఇది న్యాయమా మీకు? నాలుగురోజుల క్రితం మీ బృందం ముగ్గురు ఇవాళ ఆరుగురూ— దొరికితే ఉన్నదానికా. చిన్న ప్రాణమండీ నాది!"

మళ్ళీ మరో ఉత్తరం రాయక తప్పలేదు నాకు.

ఇది జరిగిన మూడోనాడు.—

ఆలోచించుకుని రాసుకుంటున్నాను లైబ్రరీలో. రాణి బృందం వచ్చారు. వెంటనే లేచిపోతే అను మానం వస్తుందని అలా కూర్చుని రాస్తూనే ఉండిపోయాను. లోలోపల ముచ్చెమటలు పోస్తున్నా. వెంట్రుకవాసిలో తప్పిపోయింది ప్రమాదం —! నే రాసేది ఇంగ్లీషు కాక తెలుగైతే ఆ క్షణంలో పట్టేసుకు నేవారు!

"లైబ్రరీలో కూర్చుని రాసుకునే వాళ్ళ హేండ్ రైటింగ్ తెలుసుకోడానికి కూడా మీరు ప్రయత్నాలు చేస్తే నే నిక పారుగూరు వెళ్ళి రాస్తుండాలి మీకు" వైర్లెస్ మెసేజిలా వెళ్ళిపోయింది తాజా ఉత్తరం.

ఆ మూడోనాడు.

"నీ పేరేమిటి?" మా క్లాస్‌మేటొకడ్ని నిలదీసి అడుగుతూంది కౌసల్య.

'రామారావ్' వన్నా డతను.

'చూడండి రామారావుగారూ! అమ్మాయిలకి ఉత్తరాలు రాయడం ఎన్నాళ్ళనుంచి?" కంగారు పడిపోయాడు రామారావు.

"అలా ఏనక్క. ఎర్ర చొక్కా వేసుకుని కాలేజీకి వస్తాను. మీరే గుర్తు పట్టండి! తెల్లచొక్కా వేసు కుని గేట్లో నిల్చుంటాను. మీరే పలకరించండి ఏమిటీ రాతలు, డిటెక్టివ్ కథల్లో లాగ?"

'నాకు తెలీదు మొర్రోయ్." దాదాపు కళ్ళల్లో నీళ్ళు పెట్టుకున్నాడు రామారావు.

ఎర్ర చొక్కా వేసుకుని బోట్నీ లాబ్ దగ్గర నిల్చుంటానని ఉత్తరం రాసి తెల్లచొక్కా వేసు కుని స్తంభం పక్కగా నక్కిన నాకు కాకతాళీ యంగా ఎర్రచొక్కా వేసుకుని దొరికిపోయిన రామారావుని చూస్తే జాలేసింది. విపరీతమైన భయమేసింది!

ఆ తరవాతలా ఒక డజను ఉత్తరాలు రాసి చోట్లూ, గుర్తులూ చెప్పినా రాణి నన్ను గుర్తు పట్టలేకపోయింది.

ప్రతిసారీ నాకు నేనే బయటపడదామని అను కుంటూ వచ్చినా సరిగ్గా సీన్లో కనపడే సుమిత్రనో సీలనో... కౌసల్యనో చూసి దడుచుకునే వాడ్ని. నిండుగా నవ్వుతూ ఆత్రంగా ఎదురుచూసే రాణి అంటే ఎంత ముచ్చటో అంత భయం నాకు!

రాణిని పరిచయం చేసుకోవాలి!

రాణి స్నేహం పొందాలి!!

రెండూ నిరాశగానే మిగిలిపోయాయి!

ఫైన్లియరైపోయి రాణి కాలేజీ నుంచి వెళ్ళి పోయింది. ఇంటర్ ఫస్టియర్ తరవాత మా నాన్న గారికి బదిలీ అయిపోవడంతో నేనూ విజయవాడ మారిపోవలసొచ్చింది.

విజయవాడ వెళ్తూ... వెళ్తూ.. చివరిసారిగా ప్రయత్నం చేశాను.

"ఇన్నాళ్ళు ఫలానా చోట నా కోసం చూడండి ఫలానా చోటనే ఉంటా నంటూ రాసి ధైర్యం చాలక అవ్యక్తంగా తెరచాటున ఉండిపోయే వాడిని —

క్షమించండి నేను చాలా పిరికివాడ్ని.

కానీ,

ఉన్నట్టుండి ధైర్యం పెంచుకున్నాను ఈసారి మీరెక్కడా వెతనక్కర్లేదు నా గురించి.

ఎనిమిదో తారీఖు సాయంత్రం: అయిదు గంట లకి నేనే వస్తా మీ ఇంటికి.

సామీ బ్రదర్, కృష్ణమూర్తి"


రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుకుని పోస్ట్‌లో పడేశాను. మనసు కొంచెం కుదుట పడినట్టని పించింది!

• • • • •

"ఎవరు నువ్వు? ఎందుకా వెధవరాతలు? చదువు కోమని కాలేజీలో చేర్పించింది ఆడపిల్లలకి ఉత్త రాలు రాయడానికా? టన్నుల కొద్దీ రాశావు. ఒక్క దానికైనా జవాబిచ్చిందా? వెళ్ళు.. మళ్ళీ ఎప్పుడూ ఇలాంటి పిచ్చివేషాలు వెయ్యకు." పలబై అయిదేళ్ళ ఆ ఇంటి ఇల్లాలు పేడనీళ్ళు కొట్టింది.

నీరు కారిపోయాను. ముచ్చెమటలు పుట్టేడు

యోగా మంచిదే కాని గ్యాస్ట్రోజెన్ ఏవయసు వారికైనా గ్యాస్‌ట్రబుల్‌కి త్వరగా ఉపశమనం యిస్తుంది:






MPL
Mfg. Lic. No. 123
Manufactured by
MANGALAM PHARMACEUTICALS & LABORATORIES
P. B. No. 2727
Coimbatore 641 011
Gram: "MAPHALS"

గ్యాస్ట్రోజెన్
పేరెన్నిక గల అన్ని మందుల షాపుల్లోనూ, జనరల్ స్టోర్స్‌లోనూ దొరుకుతుంది.

"గ్యాస్ట్రోజెన్" ఉచితం!
ఉచిత సాంపుల్ కోసం ఉత్పాదకులకు వ్రాయండి. రిజిస్టర్డ్ పార్సెల్ కోసం పూర్తి మొత్తం రూ. 35/- పంపండి. వి. పి. పార్సెల్ కోసం రూ. 15/- అడ్వాన్సు పంపండి. గల్ఫ్ దేశాలు యు.ఎ.ఇ.కి పంపాలంటే పూర్తి మొత్తం రూ. 65/- పంపండి.

1. గ్యాస్ ట్రబుల్‌ని త్వరగా తొలగిస్తుంది.
2. జీర్ణశక్తిని, ఆకలిని పెంచుతుంది.
3. కడుపు నొప్పిని పోగొడుతుంది.
4. అజీర్తిని నివారిస్తుంది.
5. ఛాతీలో బాధను తగ్గిస్తుంది.
6. ఛాతీలో మంటను పోగొడుతుంది.
7. దగ్గు, జలుబు రాకుండా చేస్తుంది.
8. శరీర ఉష్ణోగ్రతను సమస్థితిలో ఉంచుతుంది.
9. మిమ్మల్ని రోజంతా శక్తివంతంగా, పనిచేసేందుకు చురుకుగా ఉంచుతుంది.




రిటైల్ ధర రూ. 24.50
అన్ని పన్నులు అదనం

ఆంధ్రప్రదేశ్‌లో పంపిణీదార్లు మెసర్స్. శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్, నం. 1, శ్రీరామ బిల్డింగ్స్, హిందూపూర్, 515 201 జిల్లా. 548

దుఃఖం వచ్చేసింది. జీవితంలో అంత ఘోరమైన అవమాన మెప్పుడూ పొందలేదు. అయినా ఆత్రంగా చూశాను పరిసర ప్రాంతంలో ఎక్కడైనా రాణి కనిపిస్తుందేమోనని—

లేదు...

మళ్ళీ కనపడలేదు!

కళ్ళల్లో నీళ్ళు తిరగ్గా ఈ వంచుకుని వచ్చేశాను!!

పాతిక సంవత్సరాలు గడిచిపోయాయి!!!

ఇదిగో ఇన్నాళ్ళకి మళ్ళీ ఈ రోడ్డూ. అసంకల్పితంగా

నిశితంగా రాణి ఇంటి వైపు చూశాను. అలా చూస్తుంటే ఎందుకో అచేతనంగా నా కళ్ళు చెమర్చాయి. అక్కడా ఇల్లు లేదు. ఏదో గొడవునులాఉంది. చుట్టుపక్కల ఆ పెంకుటిళ్ళూ లేవు. డాబాలు వెలిశాయి అసలు రోడ్డు స్వరూపమే మారిపోయింది.

రుమాలుతో కళ్ళు ఒత్తుకున్నాను ఏదో దుమ్ము పడ్డట్టు. చుట్టూ చూశాను.

ఎవరూ లేరు,

వర్తమానమే!

దాంతో.

నేను వచ్చిన పనీ, చేసిన పనీ చూస్తుంటే నాకే సిగ్గనిపించింది. ఏదో కాలక్షేపానికని రోడ్డు సర్వేలు మొదలు పెడితే. ఇలా పాత విషయాల్లో పడి మునిగిపోతా ననుకో లేదు.

టైము చూసుకున్నాను.

ఎనిమిదింబావైంది. మరో గంటలో సినిమా వదిలేస్తారు. గబగబా నడిచి మళ్ళీ టూ టవున్ పోలీస్ స్టేషను దగ్గరకు వచ్చి రిక్షా ఎక్కేశాను.

● ● ● ●

"చూడమ్మా! మనం బ్రాహ్మలం. సంప్రదాయ పరంగా మనకి కొన్ని నియమాలూ, కట్టుబాట్లూ ఉన్నాయి."

"ఉండనీండి నాన్నా! నియమాలన్నవి మనం పెట్టుకున్నవే కదా!"

"అలా అనేయకు, తల్లీ! ఆలోచించే వయసు లేదు నీకు!"

"వయస్సు లేదనండి ఒప్పుకుంటాను. ఆలోచించ లేననకండి!"

"నువ్వే చెప్పు తల్లీ! ఇవాళివన్నీ బాగానేఉంటాయి. రేపు మీకు పిల్లలు పుడితే. వాళ్ళ భవిష్యత్తు చూడాలిగా మీరు!"

"మే మెలా తిరిగామో. వాళ్ళని అలాగే పెంచుతాం నాన్నా!"

"అది కాదమ్మా నా తపన. నిన్ను బట్టే మళ్ళీ బ్రాహ్మల సంబంధాలు వస్తాయా, అతన్ని బట్టే నాయుళ్ళ సంబంధా లొస్తాయా?

"ఓ. అదా నాన్నా? మీరూ చాలా వర్రీ అవుతున్నారు. అనవసరంగా నాకు స్వేచ్ఛ నిచ్చి, నే కోరుకుంటున్న వాడికిచ్చి మీరు చేస్తున్నట్టు నేను ద్రోహం జెయ్యనా? అయినా, అసలీ కులాలూ మతాలూ అన్నవి మాకే లేనప్పుడు మాపిల్లలు గురించి బెంగెందుకు నాన్నా!"

"ఇష్టపడంటే ఈ మాట అనగలుగుతున్నావు కానీ. రేపు నిజంగా అనుభవం మీద తెలిసినప్పుడు బాధ పడతావమ్మా!"

"పందొమ్మిదేళ్ళ ఈ అనుభవంలో నేను కోరుకున్నవన్నీ మంచికే అయ్యాయి నాన్నా! మీ చల్లని ఆశీస్సు లుంటే జీవితాంతం ఒడుదుడుకులు లేకుండానే సాగిపోతుంది."

"ఆ నమ్మకం నాకు ఆత్మ విశ్వాసాన్ని కలిగించేదే అయినా. అర్థిస్తున్నాను తల్లీ! కుల భ్రష్టత్వం చూడలేను. ఈ పెళ్ళి వద్దు!

"నా వూహ తెలిసి, తెలిసో. తెలాయకో ఫలానాది కావాలంటే ఒక్క క్షణం వెనకాడ లేదు మీరు. అలాంటిది జీవితంలో అతి ముఖ్యమైనది నే మనసారా కోరుకుంటూంటే."

"అదేనమ్మా అవ్యక్తమైన నా ఆవేదన.

"నన్ను కనీ పెంచి పెద్ద చేసి ఈ పరిస్థితికి తీసుకు వచ్చిన నీకెప్పుడూ మనస్తాపాన్ని కాను నాన్నా!"

"ఆ విచక్షణ నీకు ఉందని తెలుసు. కానీ నీకూ ఒక చెల్లెలు ఉందని జ్ఞాపక ముంచమ్మా! నీ ఆనందం కోసం నువ్వో దారి చూసుకుని వెళ్ళిపోతే రేపు దానికి మన సాటి సంబంధం తీసుకు రాగలనా?"

"నాన్నా, మీకు చెప్పేపాటి దాన్ని కాదు. ఒకరి ప్రభావం ఒకరి మీద ఉంటుందంటే నమ్మను నేను. సమాజం మారిపోయింది. నా వల్ల చెల్లి భవిష్యత్తు మీరు వాపోతున్నట్టు దెబ్బ తినదు. అసలలా జరగనానికి వీల్లేదు."

"సరే తల్లీ. భగవంతుడెలా రాస్తే అలాగే జరుగుతుంది కానీ నేనోసారి సుధాకర్‌తో మాట్లాడ్డానికి వీలవుతుందా?"

"తప్పకుండా నాన్నా, ఇప్పుడే వెళదాం వాళ్ళింటికి"

"ఇప్పుడొద్దులేమ్మా! బాగా పొద్దు పోయింది. రేపు పొద్దున్నే వెళదాము."

"సరే నాన్నా!"

సుజాత నిద్ర పోయింది. అలా అమాయకంగా నిద్ర పోతున్న తన్ని చూస్తుంటే. నా గుండె మీద ఎక్కి ఆడుకునే ఆ నాటి పసిపాపలానే కనపడుతూంది కానీ. ఒక పెళ్ళి కూతుర్లా అనిపించట్లేదు. కళ్ళు చెమ్మగిల్లాయి. అవ్యక్తమైన బాధ మనసుని కలవర పరుస్తూంది. పక్కన జానకి ఉన్నా కొంత వూరట కలిగేది. జానకి స్మృతితో వెదిలేసరికి అనిపించింది. నిజానికి తనెంత లోతైన మనిషనీ! 'ఒప్పేసుకోండి' అని అనడంలో పరిస్థితి కెంత రాజీపడి పోయిందనీ!

నా ప్రయత్నాల్లో మిగిలిన ఆశ సుధాకర్!

నా మానసిక పరిస్థితిని సరిగ్గా అర్థం చేసుకోగలిగితే. సుజాత మనస్సు మార్చడానికి అతనే సమర్థుడు.

అవును. ఈ విషయంలో నే నాశిస్తున్నది జరగాలంటే అతనే ఒప్పుకోవాలి.

● ● ● ●

జానకి నవ్వుతూంది.

నే శ్రోతగా ఉండిపోవాల్సి వచ్చింది!

"అమ్మా ఒద్దు తల్లీ అంటే వూరుకుంటుంది. 'బంగారుతల్లీ' అని బుజ్జగిస్తే అదే మానేస్తుంది! భలే చెప్పారండీ మీరు కబుర్లు."

"అది కాదు జానకీ!"

"నాయుళ్ళతో సంబంధమా.చస్, ఇంటికితీసుకు వచ్చేస్తా దాన్ని" అంటూ వెళ్ళారు. "యాకంగా ముహూర్తాలుకూడా పెట్టుకు వచ్చేశారు."

"ఓ. అదా, అదీ". నేను నోరు విప్పే లోపల గభాల్న వచ్చేసింది సుజాత మేడమీదికి.

"అమ్మా! నాన్నగారు భలే జోక్ చేస్తారమ్మా! కులాలూ. మతాలూ మన సంప్రదాయాలూ అంటూ బుజ్జగిస్తూ. హితబోధ చేస్తూ గడిపేరా మొన్న రాత్రంతా. నిన్న సుధాకర్‌తో మాట్లాడాలని నన్ను వాళ్ళింటికి తీసి కెళ్ళమని తీరా వెళ్ళగానే వాళ్ళ అమ్మగార్ని. అదే మా కాబోయే అత్తగార్ని చూసి.

'కనీ పెంచి పెద్ద చేసిన మా అమ్మాయిని మీ కడుపులో పెట్టుకోమని అర్థించడానికి వచ్చాను అక్కయ్యగారూ!' అంటూ ప్లేటు మార్చి నన్నూ, నా కన్నా రెట్టింపు ఆనందంలో అవిడ్నీ ముంచేశారు.'

సుజాత అమాయకంగా చెబుతూంటే. జానకి




విరగబడి నవ్వుతూంది.

"కనీ పెంచిన మమకారం అర్థం చేసుకోగలను. ఆడపిల్ల పెళ్ళయి అత్త వాంటికి వెళ్ళిపోతుందంటేనే సరిపెట్టుకోలేకపోతున్నాను వ. తప్పు, బాధ పడకండి నాకూ ఆడపిల్లలున్నారు మా పిల్ల ల్లో ఒక పిల్లగా ఉండిపోతుంది సుజాత" అని అనునయంగా వోదార్చ బోయిన ఆ ఇల్లాలితో.

"బాధ కాదు. ఆనందోత్సాహం."

"కన్నీళ్ళు కాదు, ఆహ్లాదపు జల్లు!

రాణిగారూ! మిమ్మల్ని కలుసుకోగలిగినందుకు, తబ్బిబ్బయి నోట మాట రావటం లేదు నాకు."

అని సరాసరాంతరాల్లోంచి అనాలనిపించిన నా కోరికనీ అనుభూతినీ నా లోనే దాచుకుని.

నేను ఫలానా అని రాణికే చెప్పనప్పుడు

రాణి గురించి మా ఆవిడకి చెప్పడంలో ఔచిత్యం లేదనిపించి.

"ఏమిటనుకున్నావు? వివాహం దైవనిర్ణయం జానకీ!" అనేశాను సూక్ష్మంగా.

జానకి ఇంకా విరగబడి నవ్వుతూంది ఆ మాటకి.

★